



మూసివేత దిశగా మంకీ రెస్క్యూ సెంటర్

- వైల్డ్ లైఫ్ యాక్ట్ నుంచి కోతుల తొలగింపుతో సందిగ్ధం
- వెంటాడుతున్న ఆర్థికభారం
- సర్కారుకు లేఖ రాసిన జిల్లా అటవీశాఖ

నిర్మల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను మూసి వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు మంకీ రెస్క్యూ సెంటర్‌ను మూసి వేసేందుకు అనుమతిలు ఇవ్వాలంటూ జిల్లా ఫారెస్ట్ ఉన్నతాధికారి ప్రభుత్వానికి లేఖ రాయడం చర్చనీయాంశమవుతుంది. రాష్ట్రంలో ఉన్న రీసెస్ మకాక్ కోతులను వైల్డ్‌లైఫ్ యాక్ట్ షెడ్యూల్ 1 జాబితా నుంచి ప్రభుత్వం తొలగించింది. దీంతో ఫారెస్ట్ ఆఫీసర్లు మంకీ రెస్క్యూ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఎత్తివేయాలని అటవీ అధికారులు యోచిస్తున్నారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రీసెస్ మకాక్ జాతి కోతులే నివసిస్తున్నాయి. అలాగే మంకీ రెస్క్యూసెంటర్ అటవీశాఖకు ఆర్థికంగా భారమవుతుండడమే కాకుండా ఈ సెంటర్ నిర్వహణ కూడా ఆ శాఖకు తలనొప్పిగా మారింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని గండి రామన్న అర్బన్‌పార్క్‌లో ఈ మంకీ రెస్క్యూ సెంటర్‌ను గత నాలుగేళ్ల క్రితం నిర్మించారు. అప్పటి అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఈ సెంటర్ నిర్మాణం కోసం రెండు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడమే కాకుండా అటవీశాఖకు పశుసంవర్ధక శాఖలకు నిర్వహణ బాధ్యతలను అప్పజెప్పారు. ఈ కేంద్రాన్ని నిర్వహించేందుకు పశువైద్యాధికారి ఇతర సిబ్బందిని సైతం నియమించారు. ఈ మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో కోతులకు స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ ఆపరేషన్)లు చేస్తున్నారు. స్టెరిలైజేషన్ తర్వాత కోతులకు ఇక్కడ పది రోజుల పాటు ఆశ్రయం కూడా ఇచ్చి వదిలి పెట్టాల్సి ఉంటుంది. రెండేళ్ల పాటు కరోనా కారణంగా ఈ కేంద్రం సక్రమంగా పని చేయలేదు. ఇప్పటి వరకు కేవలం 1550 కోతులకు మాత్రమే స్టెరిలైజేషన్లు చేశారు.



నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో కోతులకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేస్తున్న దృశ్యం (ఫైల్)

భారమవుతున్న నిర్వహణ

కాగా నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ నిర్వహణ అటవీ శాఖకు ఆర్థికభారంగా మారింది. పశుసంవర్ధకశాఖ ద్వారా వెటర్నరీ డాక్టర్‌ను, సిబ్బందిని అలాట్ చేసినప్పటికీ మిగతా నిర్వహణ అంతా అటవీశాఖ చేపడుతోంది. ఆశించిన లక్ష్యం ప్రకారం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, వీడీసీలు తమ ప్రాంతంలోని కోతులను పట్టించి సొంతఖర్చులతో ఇక్కడి సెంటర్‌ను తరలించాలి. నిధుల కొరతతో పంచాయతీలు మున్సిపాలిటీలు కోతులను పట్టించే విషయంలో చేతులెత్తేశాయి. దీని కారణంగా 2020 నుంచి ఇప్పటి వరకు కేవలం 1550 కోతులకు మాత్రమే ఇక్కడి సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేశారు. ఇక్కడ ఉన్న సౌకర్యాల ప్రకారం ప్రతీరోజు 100 లోపు కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉంటుందని పశువైద్యాధికారి వివరిస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు సహకరించకపోతుండడంతో ఇక్కడికి కోతులను తరలించడం సాధ్యం కావడం లేదు. ఆశించిన సంఖ్యలో స్టెరిలైజేషన్ కోసం కోతులను తీసుకురాకపోతుండడంతో డాక్టర్‌తో పాటు సిబ్బంది కూడా ఖాళీగానే ఉంటున్నారు. ఇదిలా ఉండగా కోతుల సంఖ్య మత్రం రోజురోజుకు పదింతలుగా పెరిగిపోతోంది. ప్రస్తుతం కోతుల సమస్యతో సాధారణ ప్రజలే కాకుండా రైతులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఇదే

సమస్యకు పరిష్కారం ఏది ?

రాష్ట్రంలో ఉన్న ఏకైక మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను మూసివేస్తే ఇక కోతుల జనాభా నియంత్రణ ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారనుంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు నిధుల కొరత కారణంగా కోతులను పట్టుకునే చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కో కోతిని పట్టేందుకు 1000 నుండి 1500ల రూపాయల వరకు ఖర్చవుతుంది. కోతులను పట్టే వారు కూడా ఎక్కువ సంఖ్యలో లేకపోవడం సమస్యగా మారింది. ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు కోతులను పట్టేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే మంకీ రెస్క్యూ సెంటర్ కొనసాగే అవకావం ఉంటుంది. మంకీ రెస్క్యూ సెంటర్‌ను ఎత్తేస్తే ఇక కోతుల సమస్య పరిష్కారానికి ఎలాంటి మార్గం లేదంటున్నారు. కోతుల సంఖ్యను తగ్గించాలంటే వాటి జనాభాను నియంత్రించాల్సిందే తప్ప ఇతర మార్గాలు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఘనంగా గంగామాత విగ్రహ ప్రతిష్ఠాపన



గుండపల్లిలో కొలువైన గంగామాత

దిలావర్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో కాళేశ్వరం హై లెవెల్ కెనాల్ పక్కన, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున బ్రహ్మముహూర్తంలో శ్రీ గంగామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సంజయ్‌శర్మ నేతృత్వంలో పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

పెంబి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతిమనిషి తన జీవిత కాలంలో తనకంటూ ఓ ఇళ్లు కావాలని రాత్రి, పగలు, కాయకష్టం చేసి సంపాదిస్తాడని, నాడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం నేడు ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. పేదల కోసం ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. పేదల కళ్లల్లో ఆనందాన్ని నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టించడానికి చూస్తున్నాయని, ప్రజలెవరు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్నారు. కవ్వాల్ అటవీప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో అడ్డంకులు ఉన్నాయని ప్రభుత్వం తరుపున ఉత్తర్వులు రాగానే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, సుతారి రమేష్, మహేందర్, స్వామి, టీకాజీ, బోరె రమేష్, ఖాన్, గంగాధర్, రమేష్ చారి, అశోక్‌రావు, తదితరులు ఉన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

సోన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామ శివారులో గల పసుపు పంట వేస్తున్న రైతుల పొలాలను ఏవో వినోద్ సందర్శించారు. నైరుతి ముందుగా రావడం వల్ల వ్యవసాయ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. రైతులు వాతావరణ సమాచారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా తగిన వర్షపాతం పడిన తరువాతనే విత్తనాలను విత్తు కోవాలి. పసుపు పంటలో విత్తనాలు శుద్ధి తప్పకుండా రిడోమిల్ ఎంజెడ్ దాని తరువాత ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి చేసుకోవాలి. అలాగే రైతులు లైసెన్స్ కలిగి ఉన్న డీలర్స్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న వాటికి తగిన రశీదును తీసుకుని భద్రపరచుకోవాలి. ఈ కార్యక్రమంలో రైతులు బీమేశ్వర్ పాల్గొన్నారు.


మీనాక్షి నటరాజన్‌ను కలిసిన జిల్లా మహిళా కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్‌లో పాల్గొన్న మహిళా కాంగ్రెస్ నేతలు

నిర్మల్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మీనాక్షి నటరాజన్‌ను కలిసి తాజా రాజకీయ పరిస్థితులను చర్చించినట్లు జిల్లా మహిళా నేతలు అల్లూరి కృష్ణవేణి. ఆత్రం సుగుణక్క తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసి ఆదిలాబాద్ పార్లమెంట్ నిర్మల్ జిల్లా తాజా రాజకీయ పరిస్థితుల గురించి అలాగే మహిళా సాధికారత రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళల పాత్ర, గెలుపు కోసం ఎలాంటి ప్రణాళికలతో ముందుకు వెళ్లాలి అనే విషయల గురించి చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, ఇందిరా ఫెలోషిప్ జోనల్ బాధ్యురాలు అల్లూరి కృష్ణవేణి, ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ జనరల్ సెక్రటరీ సౌమ్య, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వాసవి, సోన్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేఖ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన, పౌష్టిక భోజనం అందించాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రామారావు

సోన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేజీబీవీ సోన్‌లో నిర్వహించిన కేజీబీవీ టీఎస్ఎంఎస్, యుఆర్ఎస్, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న వంట సిబ్బందికి నూతన మెనూపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహణను జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికా హారాన్ని అందించాలని, వారి విద్యా ప్రగతికి తోడ్పడాలని సూచించారు. అందుకు వంట సిబ్బంది సరైన జగ్రత్తలు పాటిస్తూ, నాణ్యమైన సరుకులతో రుచికరంగా వండి, వడ్డించాలని తెలియజేశారు. ఇందుకోసం హైదరాబాద్‌లో ఒక్కరోజు శిక్షణ తీసుకొని వచ్చిన డీఆర్పీలు చెప్పే అంశాలను జాగ్రత్తగా విని సరైన ప్రమాణాలను పాటిస్తూ ఎస్ఓపీ ప్రకారం, నూతన మెనూ ప్రకారం వంటలు వండి విద్యార్థులకు అందించాలని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులకు అన్ని పోషకాలతో కూడిన నాణ్యమైన జాతా కూరగాయాలు, సరుకులతో రుచికరంగా వండి విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యాన్ని కాపాడుతూ వారు చదువులో ముందుండేలా దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీల సమన్వయకర్త సలోమి కరుణ, విద్యాశాఖ సమన్వయకర్తలు నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, సోన్ కేజీబీవీ ప్రత్యేక అధికారిని లతాదేవి, డీఆర్పీ సమత, శిక్షణ పొందిన వంట సిబ్బంది వసంత, శిరీష, జిల్లాలోని కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్‌స్కూల్ రెసిడెన్షియల్ స్కూల్ పాఠశాలల వంట సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో అధిక చార్జీలు వసూలు చేయొద్దు

- కలెక్టర్ అభిలాష అభినవ్



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిందేనని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం 2010, మహిళా శిశు రక్షణ చట్టాల అమలు, పర్యవేక్షణ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. మహిళా శిశు రక్షణ చట్టల అమలులో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ఆసుపత్రులు రోగుల నుంచి అధికచార్జీలు వసూలు చేయకూడదని, ప్రతి ఆసుపత్రిలో రేటుచార్ట్‌ను రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. రోగులతో మర్యాదగా మాట్లాడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతీ ఆసుపత్రిలో కనీస ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, బయో మెడికల్ వేస్ట్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ వైద్యసంస్థలు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నొస్టిక్ ల్యాబ్‌లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం కింద నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా పనిచేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై ప్రత్యేకదృష్టి సారిస్తూ, లింగనిర్ధారణకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. సంబంధిత చర్యలకు పాల్పడే వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు టోల్ ఫ్రీనెంబర్ 7337448722ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, తగిన ఫీల్డ్ తనిఖీలను నిర్వహించాల్సిందిగా వైద్యాధికారులకు సూచించారు. మానవతా విలువలు మరవకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. రోగులకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో సమయానికి అప్డేట్ చేయాల్సిందిగా అధికారులు ఆదేశించారు. అనంతరం పీసీ, పీఎన్‌డీటీ చట్టం, అమ్మ రక్ష పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. రాజేందర్, వైద్యులు గోపాల్‌సింగ్, సురేష్, సరోజ, సునీల్, ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌ల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



భూభారతి చట్టం అమలుతో రైతుల భూ సమస్యలు పరిష్కారం

సారంగపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టం అమలుతో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సారంగపూర్ మండలంలోని యాకర్‌పల్లిలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజల భూ సమస్యలను అధికారులే ప్రత్యక్షంగా గ్రామాలకు వచ్చి స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిన తరువాత భూ రికార్డుల పరంగా ఎన్నో సమస్యలలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయం అవరణలో మొక్కలు నాటి ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అలాగే బడిబాట కార్యక్రమం, పాఠశాల విద్యార్థుల హాజరు, విద్యాప్రమాణాలపై చేపడుతున్న కార్యక్రమాలపై మండల విద్యాశాఖ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తహసీల్దార్ శ్రీదేవి, అధికారులు, రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు

నిర్మల్ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సమర్థవంతంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పౌర సరఫరాల శాఖ ధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వరి కొనుగోళ్ల చివరి దశకు చేరుకుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికి ఆదేశించారు. వర్షాలతో పలు ప్రాంతాల్లో కొనుగోళ్లకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ అధికారుల సమిష్టి కృషితో పూర్తి చేశామన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో సేకరిస్తున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు 1,76,843 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. గత ఏడాఇతో పోల్చితే 6,090 మెట్రిక్ టన్నులు ఎక్కువగా సేకరించినట్టు పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియను జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించామన్నారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నెంబర్ 9182958858ను సంప్రదిచాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీసీఎస్‌వో కిరణ్ కుమార్, మేనేజర్ సుధాకర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

చైల్డ్‌పోర్న్ చూసినా.. అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు

- ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై పోక్సో కేసు నమోదు చేస్తాం..
- ఇలాంటి చర్యలపై జిల్లా సైబర్ టీం ద్వారా ప్రత్యేకదృష్టి
- ఎస్పీ డా. జి. జానకీషర్మిల



నిర్మల్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : చైల్డ్‌పోర్న్ వీడియోలు చూసినా, సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసినా కఠినచర్యలు తప్పవని జిల్లా ఎస్పీ జానకీషర్మిల పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు చైల్డ్‌పోర్న్ వీడియోలు చూడటం, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, వివిధ సోషల్ మీడియా ఖాతాలలో షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వంటి చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటిని ఎంతమత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం లేదా గూగుల్‌లో వాటి కోసం వెతకడం వంటి చర్యలను జిల్లా పోలీస్‌శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. చైల్డ్ పోర్నోగ్రఫీ అనేది ఒక తీవ్రమైన నేరమని, దీనికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠినమైన పోక్సోకేసులు చేయబడతాయని హెచ్చరించారు. పోర్న్ వీడియోలు చూడటం, వాటిని తయారు చేయడం, పంపిణీ చేయడం, ప్రచారం చేయడం వంటి కార్యకలాపాలు సమాజంలో అసభ్యతను వ్యాప్తి చేయడమే కాకుండా, మహిళలు, పిల్లల గౌరవాన్ని దిగజారుస్తాయి. అంతేకాకుండా ఇది సైబర్ నేరాల పరిధిలోకి వస్తుంది. సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన శిక్షార్హమైన చర్యలకు దారితీస్తుంది. జిల్లా లో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై జిల్లా ఐటీ నిపు ణుల ద్వారా నిందితులను గుర్తించి ఇదివరకే వారిపై తగిన కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ ఇటువంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. ఇటువంటి తప్పుదోవ పట్టించే విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తల్లి దండ్రులు కూడా తమ పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నిఘా ఉంచా లని, వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే వెంటనే 8712659599కు సమాచారం అందించాలని కోరారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య



బాణావత్ రవి (ఫైల్)

మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసు

కడెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన బాణావత్ రవి(35) నాలుగేళ్ల క్రితం అప్పు చేసి దుబాయ్‌కి వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు పెరిగిపోవడంతో చేసిన అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడెం ఎస్సై తెలిపారు.

పాఠశాల పాత భవనం కూలి ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు



గాయాల పాలైన ప్రేమ్‌కుమార్.. కూలిపోయిన భవనం

కుభీర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతర్ని గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల భవనం కూలి ఇద్దరు చిన్నారులు తీవ్రగాయాల పాలయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో నూతన పాఠశాల భవనం నిర్మించారని పక్కనే ఉన్న శిథిలావస్థలో ఉన్న భవనంలో చిన్నారులు తరచూ ఆడుకుంటారని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పిల్లలు ఆడుకునే సమయంలో ఒక్కసారిగా భవనం కూలి పోవడంతో కొంతమంది పిల్లలు పారిపోయారు. ఇద్దరు పిల్లలు భవనంలో చిక్కుకోగా గమనించిన స్థానికులు వారిని బయటికి లాగారు. అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలుడు సాయినాథ్(7)కు తలకు బలమైన గాయాలు అవ్వగా, అదే గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్(6)కు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మెరుగైన వైద్యం నిమిత్తం ఇద్దరు పిల్లలను భైంసా ఏరియాసుపత్రికి తరలించారు.

సీపీఎస్ ప్రస్తావన లేకపోవడం బాధాకరం

కుంటాల, జూన్, 6 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కెబినెట్ గురువారం నిర్వహించిన సమావేశంలో సీపీఎస్ రద్దు ప్రస్తావన లేకపోవడం బాధాకరమని పాతపెన్షన్ ఉద్యమ రాష్ట్ర నాయకుడు సీపీఎస్ కృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చినప్పటికి కేబినెట్ సమావేశంలో ఈ విషయం ప్రస్తావనకు రాకపోవడం బాధాకరమన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేస్తే వేల కోట్ల రూపాయలు మిగులుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం రద్దు చేస్తుందని ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గంజాయిపై ఉక్కుపాదం : ఉట్నూర్ ఏఎస్పీ

ఉట్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సబ్ డివిజనల్ పరిధిలో ఇప్పటి వరకు 23 గంజాయి కేసులు నమోదు చేసి 50 మందిని అరెస్టు చేయడం జరిగిందని, గంజాయి, మాదక ద్రావ్యాలను పూర్తిగా రూపుమాపాలన్న నిశ్చయంతో పోలీసు శాఖ కృషి చేస్తుందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. ఇప్పటి వరకు ఉట్నూర్ సబ్‌డివిజన్ పరిధిలో 18 కేజీల గంజాయి, 200 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలాంటి సమాచారం ఉన్న 8712659935 ఈ నెంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. గంజాయి మాదక ద్రావ్యాలను సబ్ డివిజనల్ పరిధిలో పూర్తిగా రూపుమాపాలనే దిశగా సబ్ డివిజనల్ పోలీసు యంత్రాంగం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పూర్తి సంసిద్ధమై విధులను నిర్వహిస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సబ్ డివిజనల్ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటనల విడుదల చేస్తూ సబ్ డివిజనల్ పరిధిలో గంజాయి పండించిన అమ్మిన, వ్యాపారం చేసిన సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే పాయల

జైనథ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని దీపాయిగూడ గ్రామంలో కళ్యాణ మండపం భూమిపూజతో పాటు మాకోడ, ఆకూర్ల గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ కుందన్‌పాండే, ఏఈ హారీస్, ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఎంపీఈఓ మహేశ్, మాకోడ గ్రామ కార్యదర్శి చార్లెస్, ఆకూర్ల గ్రామ కార్యదర్శి రావుత్‌సోనాలి, బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్, పార్టీ జైనథ్ మండల అధ్యక్షులు ఎల్.కరుణాకర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తే కఠిన చర్యలు : ఎస్సై

తలమడుగు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా పశువుల తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాధిక హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మంపూర్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా అనుమతి లేకుండా ఎలాంటి పశువులను తరలించవద్దన్నారు. ఎవరైనా తరలిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా మహారాష్ట్ర నుంచి అనుమతి లేకుండా దేశి దారు ఇతర మద్యం ఎవరు తీసుకురావద్దని హెచ్చరించారు. అంతేకాకుండా వాహనదారుడు తప్పనిసరి వాహన పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా తప్పదన్నారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో పోలీస్ సిబ్బందితో పాటు రెవెన్యూ పశు వైద్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

ఇచ్చోడ, జూన్ 6: మండలంలోని వివిధ పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు స్థానిక ఎమ్మార్సీ భవనానికి చేరాయి. ఈ పుస్తకాలను మండల విద్యాధికారి కసావత్ బిక్కు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది సీఆర్‌పీ శ్యాంసుందర్ సిబ్బంది సురేష్, జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

భీంపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలం పిప్పల్ కోటికి చెందిన నడికుంటి రాజమ్మ(101) శుక్రవారం వయోభారంతో మృతి చెందింది. ఆమెకు ఐదుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. మనవలు మనుమరాలు అంత కలిపి వంద మంది వరకు ఉంటారు. కాగా, రాజమ్మ నిన్నటి దాకా కూడా అన్ని తన పనులు తానే చేసుకునేదని, గ్రామంలో ఎటు వెళ్లినా చకచక నడిచేదని స్థానికులు పేర్కొనడం గమనార్హం.

ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపాలి

● బడిబాటలో ఉట్నూర్ ఎంఈవో రాపెల్లి ఆశన్న

ఉట్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసినందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఉట్నూర్ మండల విద్యాశాఖ అధికారి రాపెల్లి ఆశన్న అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించడానికి ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని, ఆంగ్ల మాధ్యమంలోనే విద్యబోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలు 97శాతం నమోదు అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ముడుగు శామ్యుల్, చిట్యాల వీరయ్య, బండి రాజారామ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రతీ విద్యార్థిని విధిగా పాఠశాలలకు వెళ్లేలా చూడాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బడిబాట ప్రతిజ్ఞ చేశారు. ప్రతిఒకరిని పాఠశాలలో చేర్పించాలని ఇంటింటా తిరుగుతూ సూచించారు. ఇందులో కుంటాల ఆశ్రమ పాఠశాల పీజీ హెచ్‌ఎం గుగ్లోత్ అంబారావ్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, సరిత, బుగ్గరాం, పీఎస్ హెచ్‌ఎం సునీత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: బడి ఈడు వయసుగల పిల్లలందరిని బడికి పంపించే బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో



కుంటాలలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిడీవో రామకాంత్, ఎంఈఓ వెంకట్రావ్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చదువు నేర్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉలస్ యాప్‌ను ప్రారంభించిందన్నారు. ఇందులో ఐకెపి ఎపిఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, రాకేష్, ఐకెపి సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే అడ్మిషన్ చేయించి ఉచితంగా అందిస్తున్న నాణ్యమైన చదువును సద్వినియోగం చేసుకోవాలని ఇంద్రవెల్లి ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆశ్రమ బాలికల పాఠశాలలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

బోథ్: బడి ఈడుకి వచ్చిన పిల్లలను బడిలోనే చేర్పించాలని పిలుపునిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కుచలాపూర్, కౌట(బి) బోథ్ తదితర గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు.

అలాగే, సిరికొండ, సోనాలతో పాటు ఆయా మండలాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక తెలంగాణ బోనాలు : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగను ఎంతో ఘనంగా నిర్వహించడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ప్రతిష్ఠ సందర్భంగా ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో బరంపూర్ వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దకాపు మెరుగు మోహన్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ పెద్దలు రమాకాంత్, మల్లేష్, ప్రతాప్, నరసయ్య, శ్రీనివాస్ శాస్త్రి, టిఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

● ఏ టైంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు రావొచ్చు

తలమడుగు: ఏ టైంలో నైనా స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ అన్నారు. మండలంలోని కుచ్లాపూర్ గ్రామంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు.

● గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి గ్రామంలో నెలకొన్న సమస్యలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

అంతరాలు లేని విద్యా విధానం రావాలి

నేరడిగొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా అందరు పిల్లలు ఒకేచోట కలిసి చదువుకునే విద్యా విధానం రావాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఉగీ టీచర్ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్య పరిచే ఉద్దేశంతో చేపట్టిన ప్రచార జాత శుక్రవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌కు ఎంపిక

తాంసి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు తాంసి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు సంజన, అనన్యలు శుక్రవారం వెలుబడిన ఫలితాలలో వారు ఎంపికయ్యారు. అదేవిధంగా కప్పర్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వైష్ణవి, శరణ్య, ఓంకార్లు కూడా ఎంపికయ్యారు. వీరికి ప్రతీ సంవత్సరం 12 వేల రూపాయల చొప్పున ఇంటర్మీడియట్ చివరి సంవత్సరం వరకు ప్రభుత్వం అందజేయనుంది. ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా అభినందించారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

బోథ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటిగాం, బాబెరా తండా, బోథ్‌లలో శుక్రవారం ఇందిరమ్మలబ్దాలకు మంజూరు పత్రాలను ఎంపీడీవో రమేష్ ఏపీవో జగదీ రావులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాన్ని సత్వరంగా పూర్తి చేసుకోవాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగు దశల్లో నిధులు అందజేయడం జరుగుతుందని లబ్దాల వివరించారు. నాలుగు దశల్లో రూ.ఐదు లక్షలు లబ్ధిదారుల అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులు టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

(5వ పేజీ తరువాయి...)

జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందింది. మైలారపు అడెల్లు మృతితో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపుగా మావోయిస్టు పార్టీ చరిత్ర ముగిసినట్లేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రూ.20 లక్షల రివార్డు

మైలారపు అడెల్లుపై రూ.20 లక్షల రివార్డు కూడా ఉంది. గతంలో పలుమార్లు జిల్లాకు వచ్చి పోయినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తుంది. ముఖ్యంగా కరోనా సమయంలో పార్టీ రిక్రూట్మెంట్ బాధ్యతలను అడెల్లుకు అప్పగించి నట్లు తెలుస్తుంది. దీంతో కొంత మంది యువకులు మావోయిస్టు పార్టీ సిద్ధాం తాలకు ఆకర్షితులైనట్లు ప్రచారం కూడా జరుగుతుంది. అంతేకాకుండా అడెల్లుకు అప్పట్లో కొమురంభీం ఆసిఫాబాద్ మంచిర్యాల (కేబీఎం) డివిజన్ కమిటీ బాధ్యుడిగా పార్టీ నియమించి రిక్రూట్‌మెంట్ బాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం జరుగుతుంది.

ఘర్షణలు సృష్టిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఇంద్రవల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నోరా(బి) గ్రామానికి చెందిన కేస్గరి రాహుల్ గ్రామంలో రెండు మతాల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించేలా వ్యవహరించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. ధన్నోర(బి) గ్రామానికి చెందిన కేస్గరి రాహుల్ ఈనెల 3న గ్రామంలో రెండు మతాల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించే విధంగా గొడవలు సృష్టించి వ్యవహరించడంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

సోనాల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టపక్క తండా సమీపంలో శుక్రవారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర బోకర్‌కు చెందిన మహమ్మద్ రిహాన్(19) మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల మేరకు.. కిన్వట్ జిల్లాకు చెందిన షేక్‌నజీం(25)షేక్ రహీమ్‌తో కలిసి తన ఆటోలో నిర్మల్ నుంచి కొత్తిమీర కట్టలను తీసుకుని నిర్మల్‌లో మహమ్మద్ రిహాన్‌ను ఆటోలో ఎక్కించుకుని వెళ్తుండగా మార్గమధ్యలో సోనాల మండలం గుట్టపక్కతండా సమీపంలో కిన్వట్ నుంచి సోనాల వైపు వస్తున్న గుర్తు తెలియనివాహనం ఢీకొనడంతో రిహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

సుప్రీం కోర్టు నోటీసుపై స్పందించిన సుగుణ

ఉట్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25వేల కోట్ల అవినీతికి పాల్పడిందని గతంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించడంతో కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు తేదీ 02-10-2024న ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని హైకోర్టులో కేటీఆర్ సవాల్ చేయగా ఇటీవల ఊరట లభించింది. అయితే హైకోర్టు తీర్పును సుగుణ సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో సమాధానం చెప్పాలని శుక్రవారం కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. ఈ మేరకు ఆమె స్పందిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను తగ్గించే ఉద్దేశంతో స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ కుట్ర పన్నుతుందని, వారు చేస్తున్న కుట్రలను తిప్పి కొడతామని అన్నారు. కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్న కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో శిక్ష తప్పదని పేర్కొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

సిరికొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యూరియా అధిక మోతాదుల్లో వాడటంతో సాగు ఖర్చు పెరగటమే కాకుండా భూమిలో ఉన్న సూక్ష్మ జీవుల సంఖ్య కూడా తగ్గిపోతుంది అని, అలాగే అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాజేందర్ రెడ్డి రైతులకు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో నిర్వహించారు. ఇందులో ఎం.రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రద్ధా రాథోడ్, తదితరులున్నారు.

డీవీఆర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స అనంతరం ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన రాజవ్వ..డాక్టర్ దేవేందర్‌రెడ్డి ఆసుపత్రికి చెందిన వైద్యులు

నిర్మల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని డాక్టర్ దేవేందర్‌రెడ్డి ఆసుపత్రిలో ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన రేండ్ల రాజవ్వ(60)కు పేస్‌మేకర్ అమర్చి రాజవ్వ ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచారు. ఇక్కడి వైద్య బృందం.. అతి తక్కువ ఖర్చుతో ఎంతో విలువైన వైద్య చికిత్సను అందించి అందరి ప్రశంసలను అందుకుంటుంది. డాక్టర్ దేవేందర్‌రెడ్డితో పాటు కార్డియాలజిస్ట్ డాక్టర్ గౌతమ్ కితాండలు చికిత్స వివరాలను వెల్లడించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మూడు నుంచి నాలుగు లక్షల వ్యయం అయ్యే ఈ చికిత్సను కేవలం 1,50,000లకే అందించామని తెలిపారు. రాజవ్వ పూర్తిస్థాయిలో కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేశామని వెల్లడించారు. కాగా అతి తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందించడం పట్ల రాజవ్వ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, నర్సింగ్, క్యాథ్ ల్యాబ్ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా భూక్యా జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలు

పెంబి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ జన్మదిన వేడుకలను పెంబి మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సల్ల నరేందర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోవింద్, ఇస్మాయిల్, గాండ్ల శంకర్, మహేందర్, షబ్బీర్, సరోజ, రూప్‌సింగ్, శ్రీనివాస్, విలాస్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వీల్‌చైర్ల విరాళం

ఖానాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా శుక్రవారం జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రికి రెండు వీల్‌చైర్లను విరాళంగా అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా పండ్లను పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. ఖానాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దు ల్‌ఖలీల్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బీసీ రాజన్న, డీఆర్బీఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్ తదితరు లున్నారు.

రెవెన్యూ సదస్సులకు అద్భుత స్పందన

నర్సాపూర్(జి), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలోని భామ్ని(బి) గ్రామంలో, అలాగే మండల కేంద్రమైన నర్సాపూర్(జి)లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ప్రజల నుండి అద్భుత స్పందన లభించింది. తమ రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో హాజరైన గ్రామస్థులు తమ దరఖాస్తులను అధికారులకు సమర్పించారు.

ఉపాధి హామీ పనులను మెరుగుపరచాలి

ముథోల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరిగే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను మెరుగుపరచాలని ఏపీడీ నాగవర్ధన్ సూచించారు.

సమష్టి బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రారంభోత్సవంలో నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు




బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు

నిర్మల్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టి బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అన్నారు. శుక్రవారం ముజ్గి గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శుక్రవారం నుంచి ఈ నెల 19 వరకు బడి బాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందులో మొదటి రోజున ఘనంగా ప్రారంభించి, ర్యాలీ, గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని ఆదేవిధంగా బడిబాట ప్రతిజ్ఞ కూడా చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలతో మెరుగ్గా తయారయ్యాయని, ఉన్నత అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, వినూత్న విద్యా కార్య క్రమాలు కూడా కొనసాగుతున్నాయని, డిజిటల్ తరగతులు, కృత్రిమ మేధ, కంప్యూటర్ పరిజ్ఞానం మొదలగు అన్ని అంశాలు కూడా అందుతున్నాయని తెలిపారు. కాబట్టి తల్లిదండ్రులు ప్రస్తుతం ఆలోచించి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసి వారి విద్యా ప్రగతికి తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో మండల విద్యాధికారి పద్మ వెంకటేశ్వర్, విద్యాశాఖ సమన్వయకర్తలు ప్రవీణ్‌కుమార్, నర్సయ్య, లింబాద్రి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధీర్, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో బడి బాట

నిర్మల్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేశ్వర్ రావు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతతో కూడిన విద్యాబోధనను అందిస్తున్నామని అలాగే ఉచితంగా పుస్తకలు, డ్రెస్‌లు, నోట్ బుక్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనం లాంటి సౌకర్యాన్ని కూడా విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్థానికులంతా సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచేందుకు టీచర్లు మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్ రావు, హెచ్ఎం అల్లం రవి బాబు, సీనియర్ టీచర్లు వసంత్ రావు, మనోహర్, గంగాధర్, రాజన్న, శ్రీనివాస్ రెడ్డి, నాగలత, హేమలత, మల్లేశం, శ్రీమంత్, జల్దా రమణ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పోషకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రారంభించిన ఎమ్మెల్యే



చిన్నారులకు పలకలు అందజేస్తున్న ఎమ్మెల్యే



కుంటాలలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తానూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోంద్రట్ గ్రామంలో ఎమ్మెల్యే పవార్ రామారావుపాటిల్ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని పోషకులకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజనం, మరిన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్న నేపథ్యంలో గ్రామంలోని విద్యార్థులు ప్రభుత్వ చేర్పించే విధంగా ఉపద్యాయులు, గ్రామప్రజలు తోడ్పడాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రధాన మంత్రి సూచించిన ఏక్ పేడ్ మాకే నామ్‌సే కార్యక్రమంలో మొక్కను నాటి నీరు పోశారు. గ్రామంలోని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసీరోద్దిన్, ఎంఈవో నరేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగ్‌నాథ్, నాయకులు లక్ష్మరెడ్డి, గోప సాయినాథ్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

మహాగాం గ్రామంలో ..

భైంసా రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాగాం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ముథోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ... పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా పని చేస్తాయన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురలు సిరాల సుష్మ, ఎంఈవో సుభాష్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సోలంకి భీమ్‌రావు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముథోల్ మండలం ఆష్టా గ్రామంలో..

ముథోల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడిబాట ఎంతో దోహదపడుతుందని ఎంఈవో రమణారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆష్టా గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలోనే గుణాత్మకమైన విద్య అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల మండలంలో..

కుంటాల, జూన్, 6 : (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని ఎంఈవో ముత్యం అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం కుంటాల మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్లు, వీఓఏలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పర్యటించి



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్కూల్ కంప్లెక్స్ హెచ్‌ఎం సదానంద్

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ముత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

దిలావర్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను బడిలో చేర్పిద్దామని దిలావర్‌పూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సదానంద్ అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఐకేపీ డ్వాక్రా సంఘాల సభ్యులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులతో దిలావర్‌పూర్‌లో ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో జరిగిన గ్రామసభలో హెచ్‌ఎం మాట్లాడారు. 6వ తేదీ నుండి 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమం ఉంటుందన్నారు. పిల్లలను సర్కారు బడిలో చేర్పించి బడిని బతికించుకుందామన్నారు. ఈ బడి అందరిదని బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. అందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ బడిని బాగు చేయడానికి పంచాయతీ తరపున అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మస్కాపూర్‌లో..

ఖానాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులు, గ్రామ పెద్దలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరినీ బడిలోకి పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూనే తమ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. ఇటీవల కాలంలో మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్షలతో పాటు ఎన్ఎంఎంఎస్ లాంటి పరీక్షల్లో కనబరిచిన ప్రతిభను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, వీడీసీ సభ్యులు పుప్పాల గజేందర్, టీచర్లు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, తొంటి శంకర్, షేక్ ఇమ్రాన్, గడువ దీప్తి, దొమ్మాట శోభారాణి, కిషన్ ప్రసాద్, విజయ్ కుమార్, షఫీ, రవి, చందన, పుప్పాల స్వప్న, తదితరులున్నారు.



మస్కాపూర్‌లో బడిబాట సందర్భంగా గ్రామంలో ర్యాలీ




భైంసాలో కొనుగోలు కేంద్రాల వద్ద నెలకొన్న సందడి



భైంసాలో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

నేడు బక్రీద్

• ముస్తాబైన ఈద్గాలు, ప్రార్థనా స్థలాలు
• కొనుగోళ్లతో సందడిగా మారిన మార్కెట్లు • పోలీసుశాఖ భారీ బందోబస్తు

భైంసా, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు త్యాగానికి ప్రతిరూపంగా భావిస్తూ నిర్వహించుకునే బక్రీద్ పండుగ కోసం జిల్లాలోని ప్రధాన ప్రాంతాలన్నీ ముస్తాబు అయ్యాయి. శనివారం నిర్వహింపబడే పర్వదిన వేడుకల ప్రత్యేక ప్రార్థనల కోసం జిల్లాకేంద్రమైన నిర్మల్‌లోని ఈద్గా, భైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గాతోపాటు ముథోల్,బాసర, ఖానాపూర్, తానూర్, ముథోల్ తదితర కేంద్రాలోన్ని ఈద్గాలతో పాటు ఆయాప్రాంతాల్లోని ప్రార్థనాస్థలాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహమ్మద్ ప్రవక్తకు ముందు ఖలీలుల్లా అనే మహానీయుడుండే వారని, ఆయన దేవుడి ఆజ్ఞ మేరకు చాలా కాలానికి జన్మించిన తన కుమారుడిని పరోపకారం కోసం బలి ఇవ్వడానికి సిద్ధపడినాడన్నది ఖురాన్ కథనం. దయా స్వరూపుడైన భగవంతుడు ఆయన కుమారుడికి బదులుగా గొర్రె పిల్లను బలిఇస్తే సరిపోతుందని సెలవివ్వగా ఆనాటి నుంచి బక్రీద్ పర్వదినాన్ని ఖలీలుల్లా త్యాగ నిరతికి గుర్తుగా పవిత్ర ఖుర్బానీ కార్యక్రమాన్ని తప్పకుండా పాటిస్తున్నారు.

నేడు సామూహిక ప్రార్థనలు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లోని మసీదులతో పాటు ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థన లను నిర్వహిస్తున్న ట్టు జిల్లాలోని ప్రధాన కేంద్రాల మత పెద్దలు తెలియ జేశారు. త్యాగ నిరతికి ప్రతిరూపంగా నిలిచే బక్రీద్ పండుగను శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లోని మసీదుల వద్ద ప్రార్థనలతో కోలాహలం కనపడింది. ప్రార్థనల కోసం వచ్చే వారితో మసీదులు కిటకిటలాడాయి. ముఖ్యంగా మాంసాహార దుకాణాల వద్ద విపరీతంగా సందడి నెలకొంది.



భైంసాలో ప్రత్యేక ప్రార్థన కోసం ముస్తాబైన ఈద్గా

కొనుగోళ్లతో సందడి

పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు గాను ముస్లింలు జరిపిన వివిధ కోనుగోళ్ళతో శుక్రవారం జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లోని మార్కెట్లు సందడిగా కనిపించింది. ప్రధానంగా సేమియా విక్రయ కేంద్రాలు, బట్టల దుకాణాలు, జనరల్ స్టోర్స్ మహిళల కొనుగోళ్లతో కళకళలాడాయి. రోడ్లపై వెలిసిన సెమియా,పాల కేంద్రాల వద్దకు అధిక సంఖ్యలో తరలివచ్చి కొనుగోళ్ల చేపట్టారు.

భారీ పోలీసు బందోబస్తు

బక్రీద్ పర్వదిన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ప్రశాంత వాతవరణంలో పూర్తిచేసేందుకు పోలీసుశాఖ ముందస్తు భారీ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతమైన భైంసాలో ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో పట్టణ సీఐ గోపినాథ్, ఎస్ఐ గౌస్‌లు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలోని పర్వదినాన్ని పురస్కరించుకొని 8 పికెట్లు ఏర్పాటు చేశారు. మూడు పెట్రోలింగ్ టీంలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో పాటు సిబ్బంది బందోబస్తు కోసం గాను తరలివచ్చారు. వీరితో పాటుగా స్పెషల్ పోలీసుల బలగాలు బందోస్తు విధుల్లో పాల్గొననున్నాయి.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి : ఎస్పీ

• భారీ బందోబస్తు ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు బక్రీద్ పండుగను శనివారం శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల కోరారు. శుక్రవారం ఆమె బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పటిష్ట బందోబస్తు చేసినట్టు తెలిపారు. మత సామరస్యం కాపాడుతూ ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలన్నారు. అన్నివర్గాల ప్రజలు, మత పెద్దలు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, ప్రేరేపించినా కఠిన చర్యలుంటయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్‌లను ఏర్పాటుచేసి 24 గంటలు తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. ఆవుల అక్రమ రవాణా జరుగకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టామని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, వదంతులు నమ్మవద్దని, ఇతరుల మనోభావాలు కించపర్చవద్దని సూచించారు. తప్పుడు సమాచారం పోస్ట్ చేసినా, ఫార్వర్డ్ చేసినా సదరు వ్యక్తులు, గ్రూప్‌లపై చట్ట ప్రకారర చర్యలుంటాయని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.



సాంగ్వీలో బడి బాట ర్యాలీలో డీఈఓ రామారావు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

• నిర్మల్ డీఈఓ రామారావు

దిలావర్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని, ఇందులో గ్రామస్థుల సహకారమే కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. బడిబాట మొదటి రోజు సాంగ్వి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. బడి బాట కార్యక్రమం కోసం గ్రామస్థులు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సంబంధమైన అన్ని రకాల శిక్షణ పొంది ఉంటారన్నారు. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం ద్వారా మంచి భవిష్యత్‌కు బాటలు వేసిన వారవుతారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి ఆర్థికంగా నష్టపోయేకంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలన్నారు. పూర్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని గుర్తు చేస్తూ డీఈవో ప్రసంగించడం గ్రామస్థులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఈవో అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంలను ఉదహరిస్తూ వారు చిన్నప్పుడు పడ్డ కష్టాలను గుర్తు చేస్తూ మాట్లాడారు. ఇంటికి దీపం ఇల్లాలు అని ఊరికే అనలేదని పిల్లలను ఎలా తయారు చేయాలన్న తల్లిదే కీలక పాత్ర అన్నారు. పోషకులలో తల్లులే కీలకం కాబట్టి ప్రత్యేక తల్లుల కమిటీ ఏర్పాటు చేసి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకోవాలన్నారు. తండ్రుల కమిటీ కూడా ఏర్పాటు చేసి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి తల్లుల గ్రూప్, తండ్రుల గ్రూప్ ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. గ్రామ ప్రముఖులు, యువకులు సైతం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా డీఈవో ఉపాధ్యాయులతో కలిసి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి నచ్చజెప్పి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామానికి చెందిన చిరంజీవి అశ్విత్ అనే విద్యార్థిని డీఈవో రామారావు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కే. శంకర్, సీఎంవో ప్రవీణ్, ఏఎంవో నర్సయ్య, ఏపీఎం సులోచనరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఈవో, ఎంఈవో

బాసరకు పోటెత్తిన భక్తులు

• వేసవి సెలవులు ముగింపువేళ పెరిగిన తాకిడి



చిన్నారికి అక్షరాలు దిద్దిస్తున్న వేద పండితుడు

బాసర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పవిత్రపుణ్య క్షేత్రం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేసవి సెలవులు ముగింపు వేళ భక్తుల తాకిడి పెరిగింది. శుక్రవారం చిన్నారులకు అక్షర శ్రీకారం జరిపించేందుకు పెద్ద ఎత్తునభక్తులు హాజరయ్యారు. రెండు మండపాలు 1,580 మంది చిన్నారులు అక్షరాభ్యాసం జరిపించుకున్నారు. పూజల కోసం క్యూలైన్‌లో రెండు నుంచి నాలుగు గంటల సమయం పట్టింది. రద్దీ పెరగడంతో విరామం లేకుండా దర్శనాలను కొనసాగిస్తున్నారు.



అక్షరశ్రీకార మండపంలో భక్తుల రద్దీ

ఫొటో న్యూస్



ప్రకృతి అందాలతో..

కనువిందు చేస్తున్న అంతర్ రాష్ట్ర రహదారి

• నిండు పచ్చదనం మనసు ఉల్లాసం

తలమడుగు, జూన్6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలతో వాహనదారులను కనివిందుచేస్తున్న అంతర్ రాష్ట్ర రహదారి తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అంతర్ రాష్ట్రరహదారికి ఇరువైపులా పచ్చని చెట్లతో ప్రకృతిఅందాలతో ప్రకృతి ప్రేమికులు మైమరిచిపోతున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన లక్ష్మంపూర్ చెక్‌పోస్టు నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు దట్టమైన అడవి అడవి మధ్యన రోడ్డుకు ఇరువైపులా బంధమైన పచ్చని చెట్లు, ఆహ్లాదాన్నిచ్చే వాతావరణంతో ప్రయాణికుల మైమరిచిపోతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో మొన్నటివరకు ఎండిన అడవి నేడు నిండు పచ్చదనంతో ప్రయాణికులను ఆకట్టుకుంది.



తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని అంతర్రాష్ట్ర రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ప్రకృతి అందాన్ని ఇస్తున్న పచ్చని చెట్లు




మత్తు పదార్థాలతో భవిష్యత్తుకు ముప్పు

• దిలావర్‌పూర్, బన్సపల్లి గ్రామాల్లో కళాజాతా బృందం ప్రచారం



దిలావర్‌పూర్‌లో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

దిలావర్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో మన భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కళాజాతా బృందం గ్రామాల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం దిలావర్‌పూర్, బన్సపల్లి గ్రామాల్లో మన నిర్మల్ ప్రగతి పథం - చైతన్య రథనం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. నిర్మల్ జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా ఏర్పాటు చేసే క్రమంలో మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను ముఖ్యంగా యువత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బంగారు భవిష్యత్తును నిర్మించుకో వాలని కళా బృందం తమ ఆటపాటల ద్వారా వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసుల, సీనియర్ సిటిజన్ యాక్ట్, బాల కార్మికుల నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన, భేటీ బచావో భేటీ పడావో, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామ గ్రామ పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, ప్రధానోపధ్యాయులు పి.సదానందం, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఎలిశెట్టి సుదర్శన్, కడారి రఘునాథ్, తిరునగిరి సుధాకర్ స్వామి, చెనిగారపు నాగరాజు, తోట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బడికి దూరమై బతుకు భారమై!

• బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని నియమాలు గాలికేనా?

ఇచ్చోడ, జూన్6 (ఆంధ్రజ్యోతి): బడీడు చిన్నారులను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రతీఏట బడిబాట కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో పర్యటించి బడిలో చేర్పిస్తున్నా పలు ప్రాంతాల్లో పిల్లలు బడిబయటి ప్రాంతాల్లోనే పర్యటిస్తున్నారు. ఇతరప్రాంతాల నుంచి వచ్చిన వలస కుటుంబాల పిల్లలు పేదరికంతో అలమటిస్తూ రోడ్లపై చెత్త కాగితాలు, అట్టముక్కల సేకరణలో నిమగ్నమ వుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చాలామంది బాలబాలికలు బడికి దూరమై బతుకుభారం మోస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రుల వెంట వెళ్తుండగా మరికొంతమంది ఒంటరిగా వెళ్త ప్రధాన రహదారుల్లో సీసాలు, చెత్తకాగితాలు ఏరుకొని విక్రయిస్తున్నారు. వీరిపై కూడా విద్యాధికారులు దృష్టిసారించి, బడికి వెళ్లేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రీక్షాలో అట్టముక్కలతో చిన్నారులు

ఆడిపాడే వయస్సులో..

ఆడిపాడాల్సిన వయస్సు అందరిలాగే బడికి వెళ్లాలని ఉండే మనస్సు వారిది. కానీ సహకరించని పరిస్థితులతో బతుకు బాటలో బాల్యం సమాధి అవుతోంది. జీవన పోరాటం చేస్తున్న అన్నాచెల్లెలు బడికి వెళ్లాల్సిన సమయంలో ఇచ్చోడ పట్టణంలోని దుకాణ సముదాయాల ముందు పడేసి ఉన్న అట్టముక్కలను ఏరుకుని రీక్షాపై వేసుకుని కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు ఈ చిన్నారులు. బడి బయట పిల్లలు ఉండకుండా.. డ్రాపౌట్స్ అనే వారే లేకుండా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా పదేపదే ఇలాంటి దృశ్యాలు కనబడుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యమో.. కటుంబ పరిస్థితిలో కానీ బడికి వెళ్లని కొందరు చిన్నారుల భవిష్యత్తు అగమ్యగోచరమవుతోంది. బడిబాట కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు స్పందించి అందరికీ విద్యనందించేలా చేయగలిగితే ఇలాంటి బాలలు మరోసారి ఇలా కనిపించరు.




పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


ప్రజల్లో ధైర్యం నింపేందుకే పోలీసుల ఫ్లాగ్ మార్చ్

• జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌అర్బన్, జూన్6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలందరికీ పోలీసులు రక్షణ కల్పిస్తూ అందుబాటులో ఉన్నారని ధైర్యం నిపేందుకే పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలో భారీ ఎత్తున 300 మంది పోలీసు సిబ్బందితో ఈ ఫ్లాగ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా కొనసాగి ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకాన్ని ధైర్యాన్ని పెంపొందించుతుందని తెలిపారు. ప్రజలందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో, పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి పండుగను నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



ఫ్లాగ్ మార్చిలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీసులు





మావోయిస్టులకు.. మరో ఎదురుదెబ్బ

» చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ » జిల్లాకు చెందిన మావోయిస్టు నేత మైలారపు అడెల్లు హతం » పక్కా వ్యూహకర్తగా పార్టీలో ప్రత్యేక గుర్తింపు » పలు ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్న అడెల్లు » అజ్ఞాతంలో ఉండగానే కత్తి లింగవ్వతో పెళ్లి » ఇప్పటికే భార్య పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి » అడెల్లు తలపై రూ.20 లక్షల రివార్డు ప్రకటించిన పోలీసులు » జిల్లాలో హైఅలర్ట్‌ను ప్రకటించిన పోలీసులు



● భీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మైలారపు అడెల్లు (ఇన్‌సెట్‌లో ఫైల్)



ఆదిలాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ ఎన్‌కౌంటర్‌ను మర్చిపోక ముందే మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం జిల్లాలో కలకలం రేపుతుంది. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో జిల్లాకు చెందిన మైలారపు అడెల్లు మృతి చెందినట్లు పోలీసులు ధ్రువీకరించారు. బోథ్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన అడెల్లు అప్పట్లో బోథ్ మండలంలో జరిగిన భూ పోరాటాలకు ఆకర్షితుడై 1986లో పీపుల్స్‌వార్ మోయిస్టు పార్టీలో చేరిపోయాడు. అప్పటి నుంచి నాలుగు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉండి మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే బీజాపూర్‌లో మిలటరీ బలగా లు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర పోరులో మైలారపు అడెల్లు మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా సరిహద్దులతో పాటు సమస్యాత్మక మండలాల్లో పోలీసులు హై అలర్ట్‌ను ప్రకటించారు.

వ్యూహరచనలో దిట్ట

మావోయిస్టు కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు వ్యూహరచన చేస్తూ పోలీసు బలగాల వ్యూహాలను తిప్పి కొట్టడంలో మైలారపు అడెల్లు దిట్ట అనే టాక్ వినిపిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు పార్టీని విస్తరింప చేసేందుకు అడెల్లులో కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తుంది. నాలుగు దశాబ్దాలుగా దండకారణ్యంలోనే ఉంటూ మావోయిస్టుల కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడు. జిల్లా దళ సభ్యుడిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగాడు.

చాలా సార్లు తప్పించుకున్నా..

మైలారపు అడెల్లు గతంలో చాలా సార్లు జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్ల నుంచి తృటిలో తప్పించుకున్నా.. ఈసారి మాత్రం తుపాకీ తూటాకు బలి కావాల్సి వచ్చింది. 1989లో ఇంద్రవెల్లి మండల డిప్యూటీ కమాండర్‌గా ఎంపికయ్యాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆదిలా బాద్ ఉమ్మడి జిల్లాలో జరిగిన దాదాపు ఐదు, ఆరు ఎన్‌కౌంటర్‌లలో తృటి లో తప్పించుకుని ప్రాణాలతో బయట పడ్డాడు. ఇచ్చోడ మండలంలోని సోన్‌పల్లి గ్రామ శివారులో ఇంద్రవెల్లి, బోథ్ దళాలకు జరిగిన ఎన్‌కౌంటర్ లో భాస్కర్ తప్పించుకున్నాడు. గండిగోపాల్‌పూర్ ఎన్‌కౌంటర్‌లో కూడా తప్పించుకున్నాడు. గండిగోపాల్‌పూర్ ఎన్‌కౌంటర్‌లో కూడా తప్పించుకున్నాడని తెలిసింది. 2020లో జరిగిన తిర్యాణి మండలం టెక్కిగూడ, కదంబ అడవుల్లో జరిగిన కాల్పుల్లో సైతం తప్పించుకున్నాడని పోలీసులు వర్గాల ద్వారా తెలుస్తుంది.

దండకారణ్యంలోనే పెళ్లి

మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న క్రమంలోనే దండకారణ్యంలో అడెల్లుకు పెళ్లి జరిగింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కత్తి లింగవ్వతో వివాహమైంది. ఆమె సైతం మావోయిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పాటు పని చేసి గత రెండేళ్ల క్రితం

(తరువాయి 6వ పేజీలో...)





స్వగ్రామమైన పొచ్చెరలో అడెల్లు ఇంటి వద్ద గుమిగూడిన ప్రజలు

భూ పోరాటం చేసి.. ఇంటికి రాకుండానే రాలిన ఎర్రమందారం



● సెల్‌లో తమ్ముడి ఫొటోలను చూస్తున్న అన్న సీతారాం

బోథ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన మైలారం అడెల్లు అలియాస్ భాస్కర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో ఆయన ఇంటి వద్ద ప్రజలు భారీ సంఖ్యలో భూమి గూడెం 1993 భూ పోరాటం సందర్భంగా ఉద్యమంలో పాల్గొని తీవ్ర నిర్బంధం మధ్యన పోరుబాట పట్టాడు ఇంటి నుంచి వెళ్లినప్పటి నుంచి ఒక్కసారి కూడా ఇంటి వైపు రాలేదని ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఎన్‌కౌంటర్‌లో తమ్ముడు మరణించాడు అన్న వార్త తెలియడంతో ఆయన కుటుంబీకులు సామాజిక మాధ్యమాలలో వచ్చిన ఫొటోలను పరిశీలన చూసి చనిపోయింది. తమ తమ్ముడేనని నిర్ధారించుకొని కన్నీటి పర్వతమయ్యారు. అయితే అడెల్లు తల్లిదండ్రులు 10 ఏళ్ల క్రితం మృతి చెందగా పోలీసులు మాత్రం గుంపులు గుంపులుగా తమ ఇంటికి వస్తూ మా వాడి జాడ గురించి అడిగే వారని కుటుంబీకులు పేర్కొన్నారు. కాగా ఇంద్రవెల్లి గల సభ్యునిగా పని చేయడంతో పాటు మంగిదల కమాండర్‌గా పనిచేస్తూనే రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చేరడం జరిగింది మృతునిపై ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు సైతం ప్రకటించారు. గత రెండు సంవత్సరాల క్రితం కరోనా సమయంలో లొంగి పోతాడని ప్రచారం జరిగిన సమయంలో కుటుంబీకులు ఆయన రాక కోసం ఎదురుచూశారు. అప్పటి పోలీస్ అధికారులు సైతం లొంగిపోతాడేమోనని ఎదురుచూశారు. చివరకు ఇంటికి రాకుండానే ఎన్‌కౌంటర్‌లో నేలరాలాడు. దాదాపు 30ఏళ్ల కాలం అజ్ఞాత జీవితం కొనసాగించిన నక్సలైట్‌గా తనదైన శైలిలో వ్యవహరించారు. గతంలో అనారోగ్యం బారిన పడి లొంగిపోతాడని తెలియడంతో పోలీసులు సైతం ఆయన లొంగిపోవాలని పిలుపునివ్వడం జరిగింది.

అడెల్లు ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు

ఎన్‌కౌంటర్‌లో మృతి మైలారపు అడెల్లుకు చెందిన అడవి ఫొటోలను చూసిన కుటుంబీకులు ఎన్‌కౌంటర్ నిజంగానే జరిగిందా? లేక పట్టుకొని కలిసి చంపారేమో? అన్న అనుమానాలను వ్యక్తపరిచారు. అంతేకాకుండా అడెల్లు నోటి నుంచి నురగ వస్తున్నట్లు ఉందని భోజనంలో ఏమైనా కలపారేమో? అంటూ పలు అనుమానాలు వ్యక్తం చేశారు.

దళ సభ్యురాలిని పెళ్లి చేసుకొని..

దళంలో పనిచేస్తున్న సమయంలో సహచర దళ సభ్యురాలు కత్తి లింగవ్వను వివాహం ఆడాడు. అయితే గత జరిగిన ఎన్‌కౌంటర్‌లో అభివృద్ధి చెందడంతో అడెల్లు లొంగి పోతాడని భావించారు. చివరకు ఆయుధాన్ని వీడకుండా ఎదురు కాల్పుల్లో మృతి చెందడం జరిగింది. ఎన్‌కౌంటర్‌లో జరిగిన ప్రతిసారి అడెల్లు పరిస్థితి గురించి ఈ ప్రాంతంలో చర్చ జరిగేది. ఎన్‌కౌంటర్‌లో అడెల్లు ఉన్నాడేమోనని ఆత్రుతగా ఈ ప్రాంత ప్రజలు పరిశీలించేవారు గురించి ఆరా తీసేవారు. ఈయన మృతితో ఈ ప్రాంతంలో సీనియర్ మావోయిస్టు మృతి చెందాడని పలువురు పేర్కొంటున్నారు.

అంకితభావంతో విధులను నిర్వర్తించాలి : ఏటీడీవో

ఉట్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో ఉద్యోగాలు పొందిన వసతి గృహ సంక్షేమ అధికారులు అంకిత భావంతో పని చేస్తూ గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉట్నూర్ ఏటీడీవో క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన భవనన్‌లో నిర్వహించిన నూతన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గిరిజన విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ నేటి విద్యార్థులను రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నూతనంగా ఉద్యోగాలకు ఎంపికైన 14 మంది, నాల్గవ తరగతి ఉద్యోగాల స్థానాల నుంచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా పదోన్నతి పొందిన ఐదుగురికి శిక్షణ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆశ్రమ పాఠశాలలో చదువుకోవడానికి వస్తున్న గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల చదువుతో పాటు వారి సంక్షేమం పట్ల శ్రద్ధ వహించాల్సి ఉంటుందని పలు అంశాలను వివరించారు.

నిధులు ఇవ్వకుంటే ఆందోళన

● కోలాం గిరిజనుల హెచ్చరిక

ఉట్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజరి కరుణించని చందంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారుల తీరు మారిందని, దీంతో అలసిపోయి ఐటీడీఏ ముందు ఆందోళన చేయాలని నిశ్చయించడం జరిగిందని కోలాం సేవా సంఘం నాయకులు ముకుందరావు, మాణిక్ రావ్, కొడప జంగు, భీమ్‌రావులు తెలిపారు. శుక్రవారం ఐటీడీఏకు వచ్చిన వారు విలేకరులతో మాట్లాడుతూ ఆదిమ గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇళ్లకు కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా లాసెట్ ప్రవేశ పరీక్ష

మావల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో లాసెట్ ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని నలందా కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షకు వచ్చిన విద్యార్థులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. పరీక్షలు మూడు షిఫ్ట్‌ల్లో జరుగగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 302 విద్యార్థులకు గాను 258 మంది హాజరయ్యారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరం కోసం అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ నెల 9 నుంచి 17 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీలు ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5, 8వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునే వారు కులం, ఆదాయం, బోనఫైడ్, ఆధార్ తప్పనిసరి అన్నారు. 20న స్థానిక పీఎంఆర్‌సీ భవనంలో లాటరీ పద్ధతిలో ఉదయం 10గంటల నుంచి అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. 3వ తరగతిలో 24, ఐదవ తరగతిలో 12, 8తరగతిలో 12 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన

● గుడిహత్నూర్ పర్యటనలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా

గుడిహత్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన అందుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమాన్నీ శుక్రవారం మండలంలోని మన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు డిజిటల్ తరగతులు, తెలుగు, ఇంగ్లీష్ మీడియం బోధన అందించడం జరుగుతుందన్నారు. జూన్ 30 వరకు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం బడిబాటకు సంబంధించిన ఆడియో పాటను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్, ఎంఈవో రాథోడ్ ఉదయ్ రావు, ఎంపీడీవో అబ్దుల్ హై, హెచ్‌ఎం సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బడిబాట ఆడియో పాటను విడుదల చేస్తున్న కలెక్టర్

● రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

గుడిహత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమవుతాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని దంపూర్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులతో ముఖాముఖిగా కలెక్టర్ చర్చలు జరిపి వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను సవివరంగా తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి అవి ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంచార్జి తహసీల్దార్ ఆర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కో ఆర్డినేషన్ మీటింగ్‌లో సీజనల్ వ్యాధుల సంసిద్ధతపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నివారణ చర్యలు, ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

నిజాయితీగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

● జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ● పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో స్పెషల్ బ్రాంచ్ కార్యాలయం ప్రారంభం

ఆదిలాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది నిజాయితి, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు హెడ్ క్వాటర్‌లో స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రికార్డులను నవీకరిస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులను సకాలంలో, సక్రమంగా పూర్తి చేయాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నిరంతరంగా సేవలు అందించాలన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగానికి స్పెషల్ బ్రాంచ్ అనేది నిఘా వ్యవస్థల పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలతో కలిసి మెలిసి ఉంటూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. సేకరించిన సమాచారాన్ని అధికారులకు అందించి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారంశ్రీనివాస్, డీసీఆర్ నాగేందర్, మోహన్, సునిల్‌కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, ఎస్సై అన్వర్ ఉల్‌హక్, ఏఎస్సై సురేందర్, ఫారుఖ్ తదితరులు పాల్గొన్నారు.



స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

● మొబైల్‌ఫోన్ పోయిందా.. సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలి

ఆదిలాబాద్ అర్బన్: పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైన సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో లేదా దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫోన్లను గుర్తించి శుక్రవారం ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. దాదాపు వంద మందికి పైగా సెల్‌ఫోన్లను తిరిగి వారికి అందించారు. మొబైల్‌ఫోన్‌లనుపోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్య తరగతి కుటుంబీకులు, బీదవారు వారుఎంతగానో కష్టపడి కొనుక్కున్న మొబైల్‌ఫోన్‌ను తిరిగి వారికి అందజేయాలని సదుద్దేశంతో జిల్లా ఎస్పీ ఈ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడారు.

నిర్ధేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

మావల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నిర్ధేశించిన లక్ష్యం మేరకు వన మహోత్సవంలో మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షనాధికారి డా.సువర్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దుర్గనగర్, మావల హరితవనాన్ని సందర్శించి ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అటవీ కార్యాలయంలో బాసర జోన్ పరిధిలోని జిల్లాల డీఎఫ్‌ఓలతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ మేరకు మాట్లాడుతూ అటవీ సంరక్షణ అందరి బాధ్యతన్నారు. 2025 గానూ వన మహోత్సవంలో భాగంగా 46 లక్షల మొక్కల నాటడం నిర్థాశించడం జరిగిందన్నారు. అటవీ శాఖ అధికారులు శర్వానన్, వికాస్ మీనన్, ప్రశాంత్, బాజీరావు పాటిల్, రవిప్రసాద్, నాగి భాను, గులాబ్ సింగ్‌లు పాల్గొన్నారు.



మావలలో హరితవనాన్ని సందర్శించిన రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి డాక్టర్ సువర్ణ

పీఎం జన్మన్ కింద 25 వన్ దన్ వికాస కేంద్రాలు : పీవో

ఉట్నూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో 25 ఆదిమ గిరిజనుల గ్రామాలకు పీఎం జన్మన్ స్కీం ద్వారా 25 వన్ దన్ వికాస కేంద్రాలు (వీడీవీకే)లు మంజూరు అయ్యాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. మంజూరైన 25 వీడీవీకేలకు ఈడీపీ, ఈపీవీ ట్రైనింగ్ పూర్తి కావడం జరిగిందన్నారు. తద్వారా 25 వీడీవీకేల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులను పిలిచి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు, జేఎస్ఎస్ మరియు ఐటీడీఏ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మినిదాల్‌మిల్, పచ్చళ్ల తయారీ, ఫౌల్ట్రిఫార్మ్, పేపర్ ప్లేట్ తయారీ కేంద్రం, ఇప్పపరక నూనె తయారీ కేంద్రం మరియు వెదరు కర్ర తయారీ కేంద్రాలకు కావాల్సిన పరికరాలు మిషనరీలు వాటికి కావాల్సిన ముడి సరుకుల గురించి క్లుప్తంగా చర్చించడం జరిగిందన్నారు. వీటికి కావాల్సిన మిషనరీలు మరియు పరికరాలు కొనుగోలు కోసం టెండర్ ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విద్యాశాఖ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్‌ల ఎస్ఎంఎం ట్రైకర్ లక్ష్మి ప్రసాద్, టీసీఆర్ అండ్ టీఐ సాయి చరణ్, ఆర్ఎం ట్రైఫెడ్ సందీప్‌శర్మ, ప్రవీణ్, వీడీవీకే సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

తాంసి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. శుక్రవారం తాంసి మండలంలోని ఈదుల్లా సావర్గామ్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ భారతితో పురాతన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. తాంసి మండలంలోని చాలా గ్రామాలలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమను నేరుగా సంప్రదించాలని తెలిపారు. తాంసి మండల రెవెన్యూ అధికారులు వారి వారి విధులను బాధ్యత యుతంగా నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా రైతులు ఇచ్చిన సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్, తదితరులు ఉన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిట్ట బొంగరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు మండలంలోని కేస్లాపూర్ రైతు వేదికలో సమావేశమయ్యారు. వర్ష కాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు సంభవించే అవకాశాలున్నాయని, గ్రామాల్లో పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాల్లో ప్రసవ సమయం దగ్గరున్న గర్భిణీ స్త్రీలను గుర్తించి ముందస్తుగా ఆరోగ్య కేంద్రానికి తరలించి బర్త్ వేటింగ్ రూమ్‌లో ఉంచాలన్నారు. వర్షాకాలంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ప్రతాప్, హెచ్‌ఈవోలు నాందేవ్, గోకుల్, హెల్త్ సూపర్‌వైజర్ జలేందర్, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అగ్రికల్చర్ సర్వీసులను రిలీజ్ చేయాలి

ఆదిలాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే అగ్రికల్చర్ సర్వీసులను రిలీజ్ చేయాలని ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. శుక్రవారం ఎస్ఈ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో సర్కిల్ రివ్యూ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిష్ కేబుల్, ఇంటర్నెట్ కేబుల్, విద్యుత్ స్తంభాలకు బిగించి ఉంటే వెంటనే సంబంధిత యజమానుల నుంచి చార్జీలను వసూలు చేయాలని, గ్రామాల్లో అన్ని రకాల పెండింగ్ బిల్లులను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.